కె.వి. విద్యార్థులకు కళాకార్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఆసిఫ్ హుస్సేన్

మచిలీపట్నంటౌన్: నగరంలోని కేంద్రీయ విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. గత ఏడాది డిసెంబరు 24వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన కూచిపూడి కళావైభవం మహా నృత్య బృందంలో ఒకేసారి 7,209 మంది కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ బృంద నృత్యంలో కేంద్రీయ విద్యాలయంలో ఏడవ తరగతి చదువుతున్న పెండ్యాల రాఘవ్, యశ్విత సాయి పాల్గొన్నారు. కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో వీరికి స్థానం లభించింది. రికార్డ్స్ నిర్వాహకులు వీరికి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. వారిద్దరినీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ మంగళవారం అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



అవనిగడ్డలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



బందరులో కేకు కట్ చేస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ, నాయకులు

అవనిగడ్డ: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం అవనిగడ్డలో ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలు చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం ప్రతి సమస్యకు పరిష్కారం చూపేలా సంక్షేమ పథకాలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేశారని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజకీయ పదవుల్లో, కార్పొరేషన్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించి వారి రాజకీయ ఎదుగుదలకు బాటలు వేశారని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ బాషా, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య, పార్టీ మండల అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, గాజుల జయగోపాల్ పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన ప్రజా సంకల్పయాత్ర

పెడన: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంత్రి జోగి రమేష్ కార్యాలయంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెడన పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు, కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు, నాయకులు వన్నంరెడ్డి మహంకాళరావు, వీణం రాము, బొర్రా మహేష్, కోడూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్రతో ప్రజల సమస్యలకు పరిష్కారం..

కోనేరుసెంటర్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్పయాత్రతో రాష్ట్రంలో అనేక సమస్యలకు పరిష్కారం లభించిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులు కేకును కట్ చేసి పంచిపెట్టారు. కిట్టు మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో భాగంగా మచిలీపట్నం వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బందరు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ భూముల్లోనే బందరుపోర్టు నిర్మాణాన్ని చేపట్టారన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణం సీఎం జగన్ పుణ్యమేనన్నారు. బందరు హార్బర్ ఆయన కృషి వలన జరిగిందేనని చెప్పారు. 28 వేల మంది పేదలకు ఇళ్లపట్టాలు వచ్చాయంటే అదీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవేనన్నారు. బందరు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సిలార్‌దాదా, రాష్ట్ర గిడ్డంగుల మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, పార్టీ నియోజకవర్గ కన్వీనర్లు శీలం మారుతీరావు, చిటికిన నాగేశ్వరరావు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనాలి

క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకుల పిలుపు

కోనేరుసెంటర్: విజయవాడలో ఏర్పాటుచేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈనెల 19న జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మచిలీపట్నంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో నాయకులు మాట్లాడారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు అంబేడ్కర్ విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేస్తానని చెప్పి పిచ్చిమొక్కల మధ్య శంకుస్థాపన చేసి వదిలేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బీసీలకు 60 శాతం పదవులు ఇచ్చి సామాజిక న్యాయం పాటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు, క్రిస్టియన్ మైనార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ మత్తే భాస్కరరావు, క్రిస్టియన్ సెల్ నాయకులు కలపాల అనుపమ, ఉప్పులేటి సురేష్, బూరగ రామారావు, యాకసిరి వెంకటేశ్వరరావు, మద్దెల పాండురంగారావు, తప్పిట రాజు, అనిల్ పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.1.58 లక్షలు

గణపేశ్వరం(నాగాయలంక): గణపేశ్వరం గ్రామంలోని దుర్గాదేవి దేవస్థానంలో అమ్మవారికి హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. వంశ పారంపర్య ధర్మకర్త మండల రాంబాబు, దేవదాయశాఖ తనిఖీ అధికారి శ్రీనివాసరావు సమక్షంలో సంవత్సర కాలానికి జరిపిన లెక్కింపులో రూ.1,58,068 ఆదాయం లభించింది. ఆలయ ఈఓ సురేష్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

26న పూర్వ విద్యార్థుల కలయిక

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఈ నెల 26వ తేదీన హైదరాబాద్ కూకట్‌పల్లిలోని హోటల్ తబలాలో జరుగుతుందని నిర్వాహకులు దొరరాజు, మద్దుల గిరీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మచిలీపట్నానికి చెందిన పూర్వ విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

నాగాయలంక: పెదపాలెం గ్రామంలో గత ఆదివారం రాత్రి జరిగిన విజయవాడ యువకుడు షేక్ షరీఫ్ హుస్సేన్ హత్యాయత్నం కేసులో ఇరువురు నిందితులను అరెస్ట్ చేశామని మంగళవారం రాత్రి నాగాయలంక ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ ఘటనలో షరీఫ్‌పై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన బొడ్డు అర్జునరావు (45), బొడ్డు వెంకట నాగరాజు (19) గ్రామంలోని చిన్న లాకుల సెంటర్‌లో తమను చూసి పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. హత్యాయత్నానికి వినియోగించిన కత్తితో సహా నిందితులను అవనిగడ్డ కోర్టులో హాజరు పర్చగా ఈ నెల 22 వరకు కోర్టు రిమాండ్ విధించిందని చెప్పారు.

హాకీ జిల్లా జట్టుకు ఎంపిక

గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు క్రీడాకారులు హాకీ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 7న మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో నిర్వహించిన జూనియర్ బాయ్స్ హాకీ సెలక్షన్స్‌లో గూడూరు హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు ఉసా హర్షవర్ధన్, కలిశెట్టి నాగేంద్రవర్మ, ఆకునూరి రిషికేష్ నాయుడు, వెన్న హేమ చంద్రతో పాటు ఏడో తరగతి విద్యార్థి సమ్మెట భరత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 10 నుంచి తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని పీడీ మత్తి అరుణ తెలిపారు.

కేంద్ర మంత్రి పర్యటనకు భారీ ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ శ్రీవాణి



సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీవాణి

కోడూరు: కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ పర్యటనకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కోడూరులో బుధవారం జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలో యశోనాయక్ పాల్గొంటారని ఆర్డీఓ శ్రీవాణి తెలిపారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అన్ని శాఖల అధికారులతో ఆర్డీఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని, రెండు గంటల పాటు సభ ఉంటుందన్నారు. సభా ప్రాంగణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలను వివరిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వైద్య సిబ్బంది సభ ప్రాంగణంలో తప్పనిసరిగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తమకు కేటాయించిన పనులను అధికారులు పూర్తి చేసి, సభను విజయవంతం చేయాలని ఆర్డీఓ కోరారు. అనంతరం ఆర్డీఓ శ్రీవాణి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అవనిగడ్డ సీఐ రమేష్ బందోబస్తుకు సంబంధించి పలు సూచనలిచ్చారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పేర్ని కిట్టు



కోనేరుసెంటర్: మండలంలోని కోన –పల్లెతుమ్మల పాలెం మీదుగా నూతనంగా నిర్మించనున్న రోడ్డు పనులకు వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత చిన్నాపురం గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కిట్టు సందర్శించారు. వైద్య సేవలను పరిశీలించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో లివర్ వ్యాధితో బాధపడుతున్న యువకుడికి వైద్యం నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 4 లక్షల చెక్కును అందజేశారు. సుల్తానగరంలో జరుగుతున్న తారురోడ్డు నిర్మాణ పనులను కిట్టు పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

కాలువ పరిశీలన..

పాతేరు–పోలాటితిప్ప గ్రామం మీదుగా వెళ్లే 9/5, 9/7 కాలువ కింద సాగు పొలాలకు నీరు కావాలని రెండు గ్రామాల రైతులు కోరగా గ్రామస్తుల అభ్యర్థన మేరకు కిట్టు కాలువను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా కాలువ ద్వారా సాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పా రు. జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లంకే వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ తోట వాసు, చిన్నాపురం గ్రామ ఇన్‌చార్జ్ జంపాన సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ శొంఠి ఫరీద్, పీఏసీఎస్ సభ్యుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల దాతృత్వం

మచిలీపట్నంటౌన్: 41వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు మీసాల అప్పన్న ఇటీవల మృతిచెందాడు. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 29,600లను డెప్యూటీ మేయర్ శీలం భారతి చేతుల మీదుగా అప్పన్న కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. లంకా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని చాటిన సంక్రాంతి వేడుకలు



కొమ్మారెడ్డి పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

నాగాయలంక: పలు విద్యాసంస్థల్లో మంగళవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలు సంస్కృతిని చాటాయి. స్థానిక మారుతీ విద్యా నికేతన్ డిజిటల్ స్కూల్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో పాఠశాల అధినేత మండ వెంకటేశ్వరరావు గాలిపటాలు ఎగురవేసి వేడుకను ప్రారంభించారు. సంక్రాంతి విశిష్టత, పండుగ సంప్రదాయాల ఆవశ్యకతను పిల్లలకు వివరించారు. చిన్నారి బాలలకు టీచర్లు, తల్లిదండ్రులు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. హరిదాసు, గోదాదేవి వేషధారణలతో చిన్నారులు అలరించారు. శ్రీకృష్ణుడి విగ్రహంతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, ఆకర్షణీయమైన రంగవల్లులను గొబ్బెమ్మలతో తీర్చిదిద్దారు. అచ్చ తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తూ మహిళా టీచర్లు కొత్త ధాన్యాన్ని రోటిలో దంచి పొంగళ్లు వండి ప్రసాద వితరణ చేశారు. ప్రిన్సిపాల్ మండ పుష్పలత, తలశిల రజని, మాదివాడ అశ్విని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బంటుమిల్లి: కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీవైఈఓ యూవీ సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పండుగల్లో దాగి ఉన్న ఆరోగ్య సూత్రాలు ఏ కాలంలో ఎలా సమాజానికి దోహదపడతాయో వివరించారు. ఎంపీపీ వి. చినబాబు మాట్లాడుతూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల వేష ధారణ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగవల్లులు వేశారు. గంగిరెద్దుల ఆటలు, భోగి మంటలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ కిషోర్ ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 బి. త్రిపురసుందరీదేవీ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి పండుగ విశిష్టతను వివరించారు. పోటీల విజేతలకు పాఠశాల పూర్వ విద్యార్థులు బహుమతులు అందజేశారు. హెచ్ఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణా విశ్వవిద్యాలయంలో..

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ జిల్లాలకు చెందిన రసాయనశాస్త్ర విభాగం విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. సంక్రాంతి పాటలకు నృత్యాలు చేశారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రామశేఖరరెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది జి. రవి, కె. పుష్పలత, ఎస్. రాంబాబు, టి. అనిల్‌కుమార్, జి. నరేష్‌బాబు, కె. సజిని, ఎస్. సుధా తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలో నగదు స్వాధీనం



గూడూరు: జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు బందరు డీఎస్పీ యు.నాగరాజు పర్యవేక్షణలో గూడూరు సెంటరులో మంగళవారం పెడన సీఐ హబీబ్ బాషా, గూడూరు ఎస్ఐ శేషుకుమార్ తమ బృందంతో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భీమవరం నుంచి ఒంగోలు వెళ్తున్న నువ్వుల వ్యాపారి వద్ద రూ.7.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ హబీబ్ బాషా వెల్లడించారు. ఈ నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికలను పురస్కరించుకుని వాహనాల తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఇంటింటి ప్రచారం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నానిని ఆదరించినట్లుగానే ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ను ఆదరించాలని కోరు తూ నగరంలోని ఒకటో డివిజన్‌లో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ జోగి చిరంజీవి ఆధ్వర్యంలో డివిజన్ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి గత నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. జగన్ పాలనలో ఆయా కుటుంబాల వారికి అందిన సంక్షేమాన్ని వివరించి మరో సారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిను దీవించాలని కోరారు. యువకుడు, ఉత్సాహవంతుడైన పేర్ని కిట్టును కూడా దీవించాలని కోరారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


పుల్లపాడులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ వాణి

అడపావారిపాలెం(మోపిదేవి): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిరుపేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. పెదకళ్లేపల్లి-2 గ్రామ సచివాలయం అడపావారిపాలెంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి నెలా రెండు దఫాలుగా వైద్యులే గ్రామాలకు వచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న పలువురు వృద్ధులు మాట్లాడుతూ ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశామని, తమలాంటి పేదలు, వృద్ధుల కోసం ఇంటి ముంగిటకే వైద్యం అందిస్తున్నది ఒక్క జగనన్న మాత్రమేనని చెప్పారు. ఆయనకు మా ఆశీర్వచనాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పండలనేని అన్నపూర్ణ, గ్రామ కన్వీనర్ పండలనేని శివప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

533 మందికి వైద్య సేవలు..

పెడన: మండలం పరిధిలోని చేవేంద్ర ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పుల్లపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం నిర్వహించారు.

శిబిరాన్ని ఎంపీపీ రాజులపాటి వాణి ప్రారంభించి మాట్లాడారు. 533 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో 38 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ప్రదీప్, శ్యామ్‌బాబు, శేషుహర్షిత, గంగాధరరావు రోగులను పరీక్షించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు అచ్యుతరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, నాయకులు పాల్గొన్నారు.

● **గూడూరు:** రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా మంగళవారం తరకటూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ, నాయకులు పాల్గొన్నారు.

15న అజ్మీర్‌కు ప్రత్యేక రైలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నుంచి అజ్మీర్‌కు వెళ్లే ప్రత్యేక రైలును ఈ ప్రాంత ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా కోరారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ ఉరుసు మహోత్సవాలకు వెళ్లే భక్తుల కోసం ఈ నెల 15న మచిలీపట్నం నుంచి అజ్మీర్‌కు ప్రత్యేక రైలు (07131) బయలుదేరుతుందన్నారు. స్థానిక రాజుపేట షాదీఖానాలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మధ్యాహ్నం 3.45 గంటలకు ప్రత్యేక రైలు మచిలీపట్నం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి 17న అజ్మీర్ చేరుతుందని, తిరిగి 21వ తేదీ తెల్లవారుజామున 4.55 గంటలకు ప్రత్యేక రైలు (07132) అజ్మీర్ నుంచి మచిలీపట్నంకు తిరుగు పయనమవుతుందన్నారు. సమావేశంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, నాయకులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తరకటూరు గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు పర్లం పెదబాబు అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సచివాలయం పరిధిలోని తరకటూరు, పిన గూడూరులంక గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి సమస్యలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగన్ పాలన

పేర్ని కిట్టు


బందరులో సంతకం చేస్తున్న పేర్ని కిట్టు


పెడనలో సంతకాల సేకరణలో పాల్గొన్న చైర్‌పర్సన్

మచిలీపట్నంటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఈ నెల 19వ తేదీన సీఎం వైఎస్ జగన్ ఆవిష్కరించనున్న నేపథ్యంలో మంగళవారం నగరంలోని 31వ డివిజన్ శారదా నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం జగన్‌కు మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కిట్టు ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ దేశంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. తన జీవితాంతం ప్రజాక్షేమానికే వినియోగించిన అంబేడ్కర్‌కు నివాళిగా ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తూ అంబేడ్కరిజాన్ని సీఎం జగన్ ముందుకు తీసుకు వెళుతున్నారన్నారు. కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు మేడెంపూడి అనిల్‌బాబు, మైఖేల్, చాట్రగడ్డ ప్రసాద్, ఏసోబు, ఎ. వెంకటేశ్వరరావు, లాజర్ పాల్గొన్నారు.

● **పెడన:** పట్టణంలోని 5, 6 సచివాలయాల్లో సంతకాల సేకరణ కార్యక్రమంలో చైర్‌పర్సన్ కటకం నాగకుమారి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్లు రహితున్నీసా, మెట్ల గోపి, నాయకులు పాల్గొన్నారు.

● మండలంలోని పుల్లపాడు గ్రామ సచివాలయంలో ఎంపీపీ రాజులపాటి వాణి, మాజీ ఎంపీపీ అచ్యుతరావు, ఎంపీడీఓ రెడ్డయ్యతో పాటు సచివాలయ ఉద్యోగులు, ప్రజలు సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో బందరు

నగరానికి వస్తున్న కార్పొరేట్ వ్యాపార సంస్థలు


నగరంలోని వస్త్ర దుకాణం

మచిలీపట్నంటౌన్: భారతదేశ చరిత్రలో మచిలీపట్నానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ పట్టణం దేశంలో ముఖ్య వ్యాపార కూడలిగా వెలుగొందింది. సముద్రతీర ప్రాంతం కావటంతో డచ్, ఫ్రెంచ్, ఆంగ్లేయుల పాలనలో వ్యాపార కేంద్రంగా విరాజిల్లింది. నాడు పోర్టు కార్యకలాపాలు పెద్దఎత్తున జరగడంతో వర్తక, వాణిజ్యంలో ప్రధాన భూమిక పోషించింది. కాలక్రమేణా పోర్టు ప్రాధాన్యత తగ్గి ఈ ప్రాంతం వర్తక, వాణిజ్యం మసకబారింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కృషితో బందరుకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. మునిసిపాల్టీ నగర పాలక సంస్థగా రూపాంతరం చెందడంతో నగరాభివృద్ధి వేగంగా జరుగుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేత నిర్ణయాలతో ఈ ప్రాంతంలో అనేక రంగాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయి. వర్తక వాణిజ్యం ఊపందుకుని పూర్వ వైభవాన్ని సంతరించుకోంటోంది.

వడివడిగా అభివృద్ధి..

సీఎం వైఎస్ జగన్ పాలనలో బందరు నగర పాలక సంస్థగా రూపాంతరం చెందడంతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్, మెడికల్ కళాశాల, జాతీయ రహదారుల అభివృద్ధి తదితర కీలక ప్రాజెక్టులు మచిలీపట్నానికి వచ్చాయి. వీటి ప్రాబల్యంతో నగరంలో జనసాంద్రత పెరిగింది. తద్వారా వ్యాపారాభివృద్ధి జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే మునుపెన్నడూ లేని విధంగా పలు స్థానిక, కార్పొరేట్ సంస్థలు వారి వ్యాపార దుకాణాలను నగరంలో ఏర్పాటు చేస్తున్నాయి. పెద్ద సంస్థలు దుకాణాలు ఏర్పాటు చేయడంతో నగరంలోని ప్రధాన రహదారి నూతన శోభను సంతరించుకుంది. సీఎం వైఎస్ జగన్ పాలనలో మచిలీపట్నం ఊహించని విధంగా అభివృద్ధి చెందడంతో ఈ ప్రాంతవాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



అవనిగడ్డ: ధనుర్మాసోత్సవాలు స్థానిక గీతా మందిరంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం గోదాదేవి-రంగనాథస్వామి వార్లకు భక్తులు పిండి దీపాలు సమర్పించారు. తిరుప్పావై పాశుర విన్నపాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు దీవి నరసింహమూర్తి పర్యవేక్షణలో అష్టోత్తర శత నామార్చనలు జరిగాయి. భక్తులు లలితా సహస్ర నామార్చన, విష్ణు సహస్ర నామార్చనలు, లక్ష్మీ సహస్ర నామార్చనలు నిర్వహించారు.

15న దత్తస్వామికి తైలాభిషేకం

మచిలీపట్నంటౌన్: దత్త విజయానంద తీర్థ స్వామీజీ జన్మదిన కార్యక్రమం స్థానిక బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో ఈ నెల 15వ తేదీన జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు దత్తస్వామికి తైలాభిషేకం, 10 గంటలకు ఆయుష్య హోమం నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం జరుగుతుందని చెప్పారు.

స్పందనకు డాక్టరేట్ ప్రదానం

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగంలో చేసిన పరిశోధనకుగానూ జంజం స్పందన కృష్ణా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. టి. మాలతిరేఖ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. జ్ఞాన మణి చేతుల మీదుగా మంగళవారం ఆమె డాక్టరేట్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి. వీరబ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.